సాక్షి
కాకినాడ

మంగళవారం । 24 । జూన్ । 2025



అయ్యప్ప ఆలయానికి విరాళం


మలికిపురం: గ్రామంలో శ్రీ హరిహరసుత అయ్యప్ప ఆలయ నిర్మాణానికి ఎన్ఆర్ఐ రావి రాధాకృష్ణమూర్తి (మలికిపురం) రూ.1,01,116 విరాళం సమర్పించారు.



ఆలయ అభివృద్ధికి..

అంబాజీపేట: వక్కలంకలోని ముత్యాలమ్మ, లంకాలమ్మ అమ్మవార్ల ఆలయానికి కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వంశీకృష్ణ రూ.1,00,111 విరాళం అందజేశారు.

డెల్టాలకు 11,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 11,800 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

సమాజానికి స్వచ్ఛమైన రాజకీయాలు అవసరం



సూర్యారావు వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

పెద్దాపురం: సమాజానికి సూర్యారావు లాంటి స్వచ్ఛమైన రాజకీయ నాయకులు ఎంతో అవసరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్, సీపీఎం నేత యాసలపు సూర్యారావు వర్ధంతి సభ ఆ పార్టీ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవినీతిపరులను పార్టీలోకి తీసుకుంటుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తోందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ మూడుసార్లు రాష్ట్ర పర్యటన చేసినా ఆంధ్రాకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు, ఆస్తి పన్నులను భారీగా పెంచిందన్నారు. తొలుత సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.బేబీరాణి, రాజశేఖర్, పలివెల వీరబాబు, నీలపాల సూరిబాబు, సిరపురపు శ్రీనివాస్, కేదారి నాగు, వీర్రాజు, కృష్ణ, గడిగట్ల సత్తిబాబు, స్నేహ, అప్పన్న, సిరిపురపు బంగారాజు, మంతెన సత్తిబాబు, మాగాపు నాగు, రామిశెట్టి సుబ్రహ్మణ్యం, అమృత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దాపురం మరిడమ్మ జాతర



పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, ఏటా 37 రోజుల పాటు ఈ మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి జూలై 31 వరకూ ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ఏటా లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. మంగళవారం రాత్రి 8.08 గంటలకు జాతర ప్రారంభమవుతుందన్నారు.

పీజీఆర్ఎస్‌కు 335 అర్జీలు



వృద్ధురాలి సమస్య వింటున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు 335 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్ఓ జె.వెంకటరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డి.పెద్దిరాజు, ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాలరావు తదితరులు అర్జీలు స్వీకరించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులో పేర్ల మార్పులు, చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, ఆన్‌లైన్‌లో భూమి వివరాల నమోదు, రీసర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్లు, కాలువల్లో పూడికల తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం ఆన్‌లైన్ సమస్యల వంటి అంశాలపై ప్రజలు అర్జీలు అందజేశారు. అర్జీదారులు పీజీఆర్ఎస్‌లోనే కాకుండా మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో కూడా అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీల ప్రస్తుత స్థితి తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1100కు నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

భీమేశ్వరాలయ అన్నదాన ట్రస్ట్‌కి రూ.5 లక్షల విరాళం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కి విజయవాడకు చెందిన నాగులపల్లి శ్రీనివాస్, పల్లవి దంపతులు సోమవారం రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. వారి తరపున విరాళం అందజేసిన ధారా జయరామకృష్ణ శాస్త్రికి ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కిక్కిరిసిన యువత, విద్యార్థులతో కాకినాడ పీఆర్ కాలేజీ – జెడ్పీ సెంటర్ రోడ్డు



ర్యాలీ ముందు వరుసలో విద్యార్థినులు, మహిళా నేతలు చంద్రకళాదీప్తి, సుంకర లక్ష్మీప్రసన్న తదితరులు

వంచనపై సమరభేరి

- కదం తొక్కిన విద్యార్థులు, యువత
- కాకినాడలో భారీ ర్యాలీ
- కూటమి సర్కారు మోసంపై ఆగ్రహం
- ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి తక్షణం ఇవ్వాలని డిమాండ్
- దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు
- కలెక్టర్‌కు వినతి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాజా, బన్నీ, రాంజీ తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'ఉద్యోగాలిస్తాం.. ఇవ్వలేకుంటే నెలనెలా రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తాం. విద్యా సంవత్సరం ముగియకుండానే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తాం' అంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు చంద్రబాబు అండ్ కో నమ్మించారు. తీరా గద్దెనెక్కిన తర్వాత తమను నిలువునా వంచించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, యువత సోమవారం పెద్ద ఎత్తున కదం తొక్కారు. కూటమి నేతల మాయమాటలతో దగా పడిన విద్యార్థులు, యువత జిల్లా నలుమూలల నుంచీ తరలివచ్చి, కూటమి సర్కారు తీరును నిరసిస్తూ ప్లకార్డులు చేతబట్టి కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన ఈ హామీలు ఏడాది కాలంగా అమలు చేయని చంద్రబాబు ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన 'యువత పోరు' పిలుపే ప్రభంజనమైనట్లు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచీ వేలాదిగా తరలివచ్చారు.

యువ'జన ప్రవాహం'

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, యువత కాకినాడ బాలా త్రిపుర సుందరి ఆలయం సమీపాన ఉన్న వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయానికి తరలివచ్చారు. అక్కడి నుంచి పార్టీ నేతలు వెంట రాగా దిక్కులు పిక్కటిల్లేలా పెద్ద పెట్టున నినాదాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. పిండాల చెరువు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం, మెక్లారిన్ కాలేజీ, పీఆర్ కాలేజీ, జిల్లా పరిషత్ జంక్షన్, సివిల్ సప్లైస్ పెట్రోల్ బంకు, ఆర్డీఓ కార్యాలయం మీదుగా కలెక్టరేట్ వరకూ ఈ ప్రదర్శన సాగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ ముందు భాగంలో నిలిచారు. పోలీసులు ఆంక్షలు పెట్టినప్పటికీ పార్టీ నేతలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి, కూటమి సర్కారు మోసాలను ఎండగడుతూ ప్రదర్శనలో పాల్గొన్నారు. పార్టీ సిటీ కార్యాలయం వద్ద బయలుదేరిన దగ్గర నుంచి జెడ్పీ సెంటర్ వరకూ ఆ మార్గమంతా కిక్కిరిసిపోయింది. ర్యాలీ జరిగిన రోడ్డు యువ జాతరను తలపించింది. 'చంద్రబాబూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట ఏమైంది సిగ్గు సిగ్గు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా మోసం చేస్తారా సిగ్గు సిగ్గు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సిగ్గు సిగ్గు, నాడు మామకు వెన్నుపోటు – నేడు యువతకు వెన్నుపోటు' అంటూ ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీగా తరలివచ్చిన విద్యార్థులు, యువత, పార్టీ నేతలు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రధాన గేటు ద్వారా కలెక్టరేట్ లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పది మంది ముఖ్య నేతలను మాత్రమే అనుమతించడంతో, వారు వెళ్లి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

యువతపోరు విజయవంతం కావడం వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ, పిఠాపురం కో ఆర్డినేటర్ వంగా గీత, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నాగులాపల్లి ధనలక్ష్మి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పెద్దాపురం కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, పార్టీ యువజన, విద్యార్థి, మహిళా విభాగాల జిల్లా అధ్యక్షులు రాగిరెడ్డి అరుణ్ కుమార్ (బన్నీ), పూసల అనిల్‌కుమార్, వర్ధినీడి సుజాత, రాష్ట్ర మహిళా కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కాకినాడ సిటీ యూత్, విద్యార్థి విభాగాల అధ్యక్షులు రోకళ్ల సత్యనారాయణ, జలగడుగుల పృథ్వి, సిటీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకటలక్ష్మి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, పార్టీ ముఖ్య నేతలు సుంకర విద్యాసాగర్, వాసిరెడ్డి జమీలు, అల్లి రాజబాబు, నాగం గంగబాబు, లాలం బాబ్జీ, రావూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల లోవరాజు, బెజవాడ సత్యనారాయణ, బెండా విష్ణు, కొప్పన శివ, గంగ్రేడు రాము, గండేపల్లి బాబీ, మాదిరెడ్డి దొరబాబు, దాసం వెంకటేష్, కారే శ్రీనివాస్, ఆనాల సుదర్శన్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర, జిల్లా నాయకులు తోట శ్రీరాంజీ, బదిరెడ్డి గోవిందు, సకురు గుర్రాజు, ఎంజీకే కిశోర్, కరణం భాను, వీరంరెడ్డి నాని, మాదేపల్లి రాజబాబు, మాదారపు నాని, సీడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దగా

విద్యార్థులకు కూటమి సర్కార్ వేల కోట్ల రూపాయలు బకాయి పడింది. విద్యా సంవత్సరం ముగియకుండానే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థులను రోడ్డున పడేసింది. సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోంది. వారానికో ఈవెంట్ చేస్తూ ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేసే ప్రభుత్వంలా మారింది. ప్రజల్లోకి జగన్‌మోహన్‌రెడ్డి గళం వెళ్లకుండా ఉండేందుకు కుట్రలు చేస్తోంది. ప్రజలకు జగన్ నుంచి సహకారం అందకుండా చేయాలనుకుంటోంది. ఒక వ్యూహం ప్రకారం ప్రతిపక్షమనేది లేకుండా చేయాలని చంద్రబాబు అండ్ కో కుయుక్తులు పన్నుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి 80 ఏళ్ల వయసులో కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రిగా చేసిన జగన్‌మోహన్‌రెడ్డి తలకాయ నరికేస్తానంటూ ఒక ఎమ్మెల్యేగా ఆయన ఎలా మాట్లాడతారు? హామీలు అమలు చేయాలని, రాష్ట్ర సమస్యల పైన మీడియా సమావేశంలో ప్రభుత్వాన్ని జగన్ నిలదీశారు. మీడియా నుంచి వచ్చిన రప్పా రప్పా అనే ప్రశ్నకు ఆయన సమాధానం మాత్రమే చెప్పారు. ఒక టీడీపీ కార్యకర్త మోసపోయామనే బాధతో రప్పా రప్పా అని ఫ్లెక్సీ పెట్టుకున్న విషయాన్ని ప్రస్తావించారు. అది సినిమా డైలాగ్ తప్ప మరొకటి కాదని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ డైలాగ్‌ను టాపిక్ డైవర్షన్ కోసం వాడుకుంటోంది. నిరుద్యోగ భృతి రప్పా, ఫీజు రీయింబర్స్‌మెంట్ రప్పా రప్పా, హామీలన్నీ రప్పా రప్పా కాదా?

– దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

సర్కార్‌కు కనువిప్పు కలగాలి

యువత పోరుతో కూటమి సర్కార్‌కు కనువిప్పు కలగాలి. విద్యా సంవత్సరం ముగిసిపోయినా ఇప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ప్రభుత్వం దగా చేస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. దీనంతటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. మంత్రి లోకేష్ తాము ఇచ్చిన 31 హామీలు 31 కెమెరాల్లో ఫీడ్ చేసుకోమని నాడు ఎన్నికల సందర్భంగా చెప్పారు. ఇప్పుడేమో రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతున్నారే తప్ప హామీలు, సంక్షేమ పథకాలను పట్టించుకోవడం లేదు. ఫీజుల ఇబ్బందుల నుంచి విద్యార్థులను బయటపడేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– రాగిరెడ్డి అరుణ్ కుమార్ (బన్నీ), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

హామీలు అమలు చేయాలి

హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్న కూటమి సర్కారుపై యువత తిరగబడింది. ఇది తొలి అడుగుగా గుర్తెరిగి విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేలా యువత పోరుకు విద్యార్థులు, యువత తరలివచ్చారు. ప్రభుత్వంపై ఏడాది కాలంగా నెలకొన్న వ్యతిరేకతకు ఇది అద్దం పడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతి దీవెనలను అటకెక్కించిన సర్కారు.. విద్యార్థులను రోడ్డు పాలు చేసింది.

– పూసల అనిల్ కుమార్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు, కాకినాడ



ర్యాలీలో దాడిశెట్టి రాజా, రాగిరెడ్డి బన్నీ, తోట శ్రీరాంజీ

ఆసనాలకు ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

అమలాపురం రూరల్: కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ఈ నెల మూడో తేదీన అంతర్వేది సముద్ర తీరంలో నిర్వహించిన వృక్షాసనం, భారీ మానవహారం ఆసనాలు ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించాయి. వికసిత్ భారత్‌లో భాగంగా నిర్వహించిన యోగ ఆంధ్ర మాసోత్సవాల ద్వారా అంతర్వేదిలో నిర్వహించిన వృక్షాసన భారీ మానవహారం ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించడంపై డీఆర్వో రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ డీఎల్‌డీవో రాజేశ్వరరావు, ఎస్‌డీసీ పి.కృష్ణమూర్తి, జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు, జిల్లా స్థాయి అధికారుల బృందం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను అభినందించారు.



ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించిన అంతర్వేది వృక్షాసన భారీ మానవహారం ఆసనాలు

కోకో సాగు విస్తీర్ణం గుర్తింపునకు ఈ-క్రాప్

దేవరపల్లి: ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా జిల్లాలో కోకో సాగు విస్తీర్ణాన్ని గుర్తిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. నల్లజర్ల మండలం చోడవరంలో సోమవారం కోకో తోటలను ఆమె పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కోకో రైతులు ఈ-క్రాప్ బుకింగ్ చేయకపోవడం వల్ల వివరాలు తెలుసుకోవడంలో జాప్యం జరుగుతోందని చెప్పారు. ఈ-క్రాప్ బుకింగ్ సమయంలో ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నారనే వివరాలను తప్పకుండా నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులుండవని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. నల్లజర్ల మండలంలో 457 ఎకరాల్లో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. కోకో రైతుల నుంచి ప్రతి గింజా కొనుగోలు చేసేందుకు మద్దతు ఇస్తామని కలెక్టర్ తెలిపారు. కోకో రైతుల నుంచి కంపెనీలు కిలో రూ.500 చొప్పున కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతు కొత్తపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ, కిలో కోకో గింజలకు రూ.500 ధర ప్రకటించడం రైతులకు, కంపెనీలకు ఆమోదయోగ్యంగా ఉందని అన్నారు.



కోకో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

కౌలుకోలేని దెబ్బ

- 24 గంటలన్నారు.. 45 రోజులైనా రాని ధాన్యం సొమ్ము
- ఖరీఫ్ పెట్టుబడికి డబ్బుల్లేక కౌలు రైతుల ఆందోళన
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు తీసుకోవడానికి అధికారుల నిరాకరణ
- కన్నీటి పర్యంతమైన అన్నదాతలు



పాడా కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

పిఠాపురం: ఖరీఫ్ సాగు మొదలైపోయింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు పొలం బాట పడుతున్నారు. కానీ, చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. అప్పు పుట్టడం లేదు. కౌలు చెల్లిస్తేనే భూమిలో అడుగు పెట్టాలని యజమానులైన రైతులు కరాఖండిగా చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో.. ముందస్తు సాగు చేయాలని, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలు కాపాడుకోవాలని ఊదరగొడుతున్న ప్రభుత్వం.. తమకివ్వాల్సిన ధాన్యం సొమ్ము గురించి మాత్రం నోరు మెదపడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రబీ ధాన్యం విక్రయించిన రైతులకు జిల్లా వ్యాప్తంగా రూ.60 కోట్లు, పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 250 మంది రైతులకు రూ.10 కోట్లకు పైగా ప్రభుత్వం బకాయి పెట్టింది. ఈ డబ్బులు ఇవ్వకపోతే ఖరీఫ్ సాగుకు పెట్టుబడి ఎక్కడి నుంచి తీసుకురావాలని ప్రశ్నిస్తున్నారు. గత రబీలో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించింది. ఇది జరిగి 45 రోజులైంది. అప్పుడే ఖరీఫ్ కూడా వచ్చేసింది. అయినప్పటికీ ప్రభుత్వం ధాన్యం సొమ్ము ఇవ్వడం లేదు. ఈ డబ్బులు వెంటనే ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై అర్జీ ఇచ్చేందుకు వారు ప్రయత్నించగా కాగితం రూపంలో వద్దని, మామూలుగా చెప్పాలని అంటూ రైతుల నుంచి ఫిర్యాదు తీసుకునేందుకు అధికారులు నిరాకరించారు. దీంతో, రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. పండించిన ప్రతి ధాన్యం గింజా కొంటామని, 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని గొప్పలు చెప్పిన అధికారులు.. ఇప్పుడు అర్జీ తీసుకోవడానికి సైతం నిరాకరిస్తున్నారని, ఇక తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇవ్వాల్సిన ధాన్యం సొమ్ము ఇవ్వకపోగా తిరిగి అప్పులు చేయాల్సిన దుస్థితిలోకి ప్రభుత్వం నెట్టేసిందని వాపోయారు. మరోవైపు అప్పులు కూడా పుట్టడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వాన్ని నమ్మి కోలుకోలేని విధంగా దెబ్బ తిన్నామని కన్నీరు పెట్టుకుంటున్నారు.

మరో మూడు వారాలంటున్నారు



ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. ధాన్యం సొమ్ము రావడానికి ఇంకా మూడు వారాలు పడుతుందంటున్నారు. ముందు కౌలు ఇస్తే తప్ప భూమిలోకి రావద్దని యజమాని అంటున్నాడు. అప్పు చేసి ఇద్దామంటే అప్పులు ఇచ్చే వారు కూడా లేరు. రబీలోనే ఆస్తులు తాకట్టు పెట్టి, అప్పులు తెచ్చి సాగు చేశాం. ధాన్యం సొమ్ము వస్తుందని, పెట్టుబడికి ఇబ్బంది ఉండదని అనుకున్నాం. కానీ అటు సొమ్ము రాక.. ఇటు పంట వేసే దారి లేక ఆస్తులు తాకట్టులో ఉండిపోయి వడ్డీలు పెరిగిపోతున్నాయి. వచ్చే సొమ్ము వడ్డీలకే సరిపోని పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటే ధర తక్కువైనా వెంటనే సొమ్ము ఇచ్చేసేవారు. అలా అమ్మనీయకుండా అధికారులు వచ్చి మమ్మల్ని నమ్మించి, ఇప్పుడు నట్టేట ముంచారు.

– విజయకుమార్, కౌలు రైతు, గొల్లప్రోలు మండలం

ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు



రైతును ఇంత దారుణంగా ఇబ్బంది పెట్టడం ఎప్పుడూ చూడలేదు. 'గంటల్లో మీ డబ్బు మీ ఇంటికి వస్తుంది' అని గొప్పగా చెప్పారు. ప్రైవేటు వ్యాపారికి అమ్మితే చర్యలు తీసుకుంటామని భయపెట్టారు. ప్రభుత్వానికి అమ్మితే మాకు రక్షణగా ఉంటుందని నమ్మాం. తీరా ధాన్యం అమ్మి 45 రోజులైనా ఇదిగో అదుగో అంటున్నారు తప్ప డబ్బులు వేయడం లేదు. అప్పుడు మా దగ్గరకు వచ్చి ధాన్యం అమ్మాలని చెప్పిన ఏ అధికారీ ఇప్పుడు సమాధానం చెప్పడం లేదు. ఎవరిని అడగాలో తెలియడం లేదు. కనిపించిన ప్రతి ఆఫీసుకు, అధికారి వద్దకు తిరుగుతున్నాం. ఇప్పుడు సాగు పెట్టుబడికి డబ్బుల్లేవు. ఇక తాకట్టు పెట్టడానికి మా దగ్గర ఆస్తులూ లేవు. అప్పులు ఇచ్చేవారూ లేరు. అన్నం పెట్టే రైతును ఏడిపించడం ప్రభుత్వానికి తగదు.

– నాగేశ్వరరావు, కౌలు రైతు, గొల్లప్రోలు మండలం

నట్టేట ముంచారు



రైతులను నమ్మించి ప్రభుత్వం నట్టేట ముంచింది. రైతు సంక్షేమమే ధ్యేయమని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు సమాధానం చెప్పాలి. 24 గంటల్లో డబ్బులు వేస్తామంటూ తెగ గొప్పలు చెప్పిన నేతలు, అధికారులు ఇప్పుడు మాట్లాడటం లేదు. ఆరుగాలం కష్టపడి ఎండనక వాననక ఒళ్లు గుల్ల చేసుకుని అప్పు చేసి మరీ పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు డబ్బులు ఇవ్వకపోతే రైతు ఎలా మళ్లీ పంట పండిస్తాడు? ఉన్న అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతూంటే ఇంకా వాయిదాలు వేయడమేమిటి? ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్లే ఇలా జరుగుతోంది. రైతులకు వెంటనే ధాన్యం సొమ్ము చెల్లించాలి. లేకపోతే రైతుల తరపున వైఎస్సార్ సీపీ ఉద్యమిస్తుంది. రైతులకు ఏమాత్రం అన్యాయం జరిగినా ఊరుకునేది లేదు.

– వంగా గీతా విశ్వనాథ్, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పిఠాపురం

క్లుప్తంగా

బాధితురాలి చేతికి చేరిన బంగారు గొలుసు



బాధిత దంపతులకు బంగారు గొలుసు అందజేసిన డీఎస్పీ తదితరులు

సామర్లకోట: విశాఖపట్నానికి చెందిన దంపతులు సామర్లకోటలో పోగొట్టుకున్న బంగారు గొలుసును పోలీసులు సోమవారం బాధితురాలికి అందజేశారు. కలిపిరెడ్డి నారాయణమ్మ, జగన్‌మోహన్‌రావు ఆదివారం విశాఖపట్నం నుంచి బంధువుల ఇంటికి వచ్చి స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఒక హోటల్‌లో అల్పాహారం చేశారు. అనంతరం ఆ దంపతులు రోడ్డుపై పర్సు జాడ విరుచుకున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లిన తరువాత చూసుకొంటే పర్సు కనిపించక పోవడంతో స్థానిక అవుట్ పోస్టులోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు మూడు తులాల బరువైన రూ. మూడు లక్షల విలువ కలిగిన బంగారు గొలుసు పోవడంతో ఎస్పీ ఈ కేసును ఛేదించాలని పోలీసులను ఆదేశించారు. దాంతో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అవుట్ పోస్టు పోలీసు స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించారు. ఒక బిచ్చగాడు రోడ్డుపై పడిపోయిన పర్సు తీసుకొని జేబులో పెట్టుకోవడాన్ని గుర్తించారు. వెంటనే ట్రాఫిక్ పోలీసులు బిచ్చగాని కోసం గాలింపు చేసి గుర్తించి అతని వద్ద నుంచి పర్సును సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పర్సులో బంగారు గొలుసు ఉండటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బాధితులకు సమాచారం ఇచ్చారు. పెద్దాపురం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు బంగారు గొలుసు అందజేశారు.

మహిళా ప్రజా ప్రతినిధులకు శిక్షణ ప్రారంభం



శిక్షణలో పాల్గొన్న మహిళలు

కాకినాడ సిటీ: రాష్ట్రంలో స్థానిక సంస్థల మహిళా ప్రజా ప్రతినిధులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రజా పరిషత్ కాకినాడలో ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ లింగ సమానత్వమే లక్ష్యంగా అనేక విధానాలు అమలులో ఉన్నప్పటికీ, మహిళలు రాజకీయాల్లో నిర్ణయాలు తీసుకోవడంలో తక్కువ ప్రాతినిధ్యం పొందుతున్నారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మహిళా సాధికారతతో స్వపరిపాలన సాధ్యం పేరిట ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. నిధులు, విధులు, భావ వ్యక్తీకీకరణ నైపుణ్యం, ప్రజాస్వామ్య విధుల సులభతరం వంటి అంశాలపై ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు.

అమ్మ ఓడి..పోయింది

- కన్న కొడుకును చూసి కన్నుమూయాలని చివరి క్షణం వరకు తల్లి ఆవేదన
- 20 ఏళ్ల క్రితం విడిచిపోయిన కొడుకు
- తల్లి చావుబతుకుల్లో ఉందంటే చూసేందుకైనా రాని కాఠిన్యం
- అధికారుల వార్నింగ్‌తో అంతిమ సంస్కారాలకు హాజరు



జోష్యబట్ల రాజేశ్వరి(ఫైల్)

కాకినాడ క్రైం: చివరి రోజుల్లో.. చిట్టచివరి క్షణాల్లో.. కొడుకు కంటి చూపు, స్పర్శ కోసం పరితపించిన ఓ తల్లి వ్యథ ఇది. కాటికేగే వేళ కన్నబిడ్డను కళ్లారా చూసుకుంటే చాలనుకున్న ఓ వ్యథార్థ మాతృమూర్తి యథార్థ గాథ ఇది. అంతిమ ఘడియల్లో అన్నీ తెలిసి కొడుకు కావాలనే రాలేదన్న గుండె పగిలే చేదు నిజాన్ని తాళలేక ఆ కన్నీటి వ్యథతోనే కన్ను మూసిన ఓ అమ్మ కథ ఇది.

అనగనగా ఓ తల్లి... బొమ్మని చేసి, ప్రాణం పోసింది. తన రక్త మాంసాలను పంచి ఇచ్చి, ప్రసవ వేళ ప్రాణాన్నే పణంగా పెట్టి ఓ కొడుకుని కన్నది. ఊపిరంతా ఉయ్యాల చేసి లాలపాడింది, జోల పుచ్చింది. మాతృత్వపు మాధుర్యంతో తనివి తీరా తరించిపోయింది. కొడుకుని పెంచి పోషించి ప్రయోజకుడ్ని చేసింది. అమ్మ త్యాగంతో కొడుకు పెద్దోడయ్యాడు. ఎంత పెద్దోడంటే చనిపోతున్నాను చూసెళ్లమంటే తనకు తీరికే లేదనేంత... అప్పుడెప్పుడో 20 ఏళ్ల క్రితం వదిలిపోయావనీ, నాటి నుంచి కంటికి కానరాలేదనీ, చిట్టచివరిగా ఒక్కసారి కనిపించి వెళ్లపో నాయనా అంటూ తల్లి అచేతన స్థితిలో వీడియో పంపి మరీ వేడుకున్నా ఆ కొడుకు మనసు కరగలేదు. చివరికి అమ్మ ఆక్రందనే ఓడిపోయింది. పుత్రరత్నం తాను ఉన్న హైదరాబాద్ నుంచి తల్లి ఉన్న కాకినాడకి తీరిక చూసుకొని చేరేసరికి ఆయువు పోసిన అమ్మ ఊపిరి అనంత వాయువుల్లో కలిసిపోయింది. తుది మలుపులో కొడుకుని కళ్లారా చూసుకోలేకపోయిన ఆ అమాయకపు తల్లి రాజేశ్వరి అయితే, కాఠిన్యం నిండిన ఆ కొడుకు పేరు జోష్యబట్ల రాజశేఖర్.

తనువు చాలించే వేళ బిడ్డను చూస్తే చాలనుకుంది. పున్నామ నరకం నుంచి తప్పించడమే ఎక్కువనుకొని చిట్ట చివరి వేళ కట్టె గుట్టకి నిప్పంటించి నిష్క్రమించాడా కొడుకు. బిడ్డ కోసం పరితపించి

అంతిమ సంస్కారాలు మీరే చెయ్యండి

రాజశేఖర్ వచ్చి తల్లి మృతదేహాన్ని చూసి మండిపడ్డాడు. ఇంత మాత్రానికే తనను ఎందుకు ఇబ్బంది పెట్టారని విసుక్కున్నాడు. అంతిమ సంస్కారాలు కూడా మీరే చేసేయండని ఎంత కావాలన్నా ఇచ్చేస్తానని బేరాలాడాడు. శైలజ ఆమె బృందం చొరవ తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆమె చూడాలన్న ఆఖరి కోరిక ఎలాగో తీర్చలేదు, కనీసం తలకొరివి అయినా పెట్టమని అడిగారు. సఖి వన్‌స్టాప్ సెంటర్, బాధ్యత ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. ఎట్టకేలకు రాజశేఖర్ మాతృమూర్తి మృతదేహానికి తలకొరివి పెట్టాడు. అంతిమ సంస్కారాలు బలవంతంగా చేయించిన అధికారులు, ఫౌండేషన్ సభ్యులపై విసుక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ప్రాణం విడిచిన ఆ మాతృమూర్తి దీనావస్థ మానవత్వానికే మాయని మచ్చగా నిలిచిపోయింది. కన్న పేగు మమకారాన్ని చిదిమేసిన ఈ హృదయ విదారక సంఘటన కాకినాడలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

కొడుకు కోసమే యావత్ జీవితం

కాకినాడ దేవాలయం వీధి వినుకొండ వారి వీధికి చెందిన జోష్యబట్ల రాజేశ్వరి(70) తన ఒక్కగానొక్క కుమారుడి కోసం తన యావత్ జీవితాన్ని అర్పించింది. ఈమెకి 45 ఏళ్ల కుమారుడు రాజశేఖర్ ఉన్నాడు. బిడ్డను కని భర్త వదిలి పోయినా టైలరింగ్ చేస్తూ కుమారుడిని చదివించింది. పదవ తరగతి అనంతరం విడిచిపోయిన తండ్రి పిలుపుతో రాజశేఖర్ కేరళ వెళ్లాడు. కొన్నేళ్ల తర్వాత తల్లి వద్దకు వచ్చాడు. ఉద్యోగం కోసం వెతుకుతుంటే తల్లి.. కొడుకు బాధను అర్థం చేసుకొని తెలిసిన వారి సాయంతో కాకినాడలో ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం వేయించింది. అదే సమయంలో, అంటే సుమారు 20 ఏళ్ల క్రితం తల్లిని పిలవకుండానే స్థానిక కల్యాణ మండపంలో ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. ఒకసారి తన భార్యను చూపించి, నాటి నుంచి తల్లిని వదిలిపోయాడు.

కార్పొరేటర్ చొరవతో..

అనాథాశ్రమంలో రాజేశ్వరి పరిస్థితి దయనీయంగా మారింది. ఆశ్రమ నిబంధనల ప్రకారం స్వయంగా తమ సేవలు తాము చేసుకునేవారికే అక్కడ స్థానం ఉంటుంది. నానాటికీ క్షీణిస్తున్న ఆరోగ్య పరిస్థితితో రాజేశ్వరి మంచానికి పరిమితం అయింది. ఆశ్రమ యాజమాన్యం రాజేశ్వరిని చేర్చిన కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్నకు విషయం చెప్పడంతో ఆమె రాజేశ్వరిని



రాజేశ్వరి మృతదేహాన్ని కాటికి తరలిస్తున్న బాధ్యత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సత్యనారాయణ బృందం



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేశ్వరి ఆరోగ్య స్థితిని పరిశీలిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ బృందం

వదిలిపోయి 20 ఏళ్లు

20 ఏళ్ల క్రితం తల్లిని వదిలిపోయిన రాజశేఖర్ మళ్లీ తల్లిని ఒక్క రోజైనా చూడలేదు. రాజేశ్వరి కొడుకు వస్తాడని ఏళ్లకు ఏళ్లు ఎదురు చూస్తూ ఓ అద్దె ఇంట్లో ఉంటూ అనారోగ్యంతో టైలరింగ్ చేసుకుంటూ తనని తాను పోషించుకునేది. వచ్చిన ఆ కొద్దిపాటి సంపాదన మందుల కోసం వెచ్చించేది. ఐదేళ్ల క్రితం అంటే ఆమె వయసు 65కి చేరాక అనారోగ్యానికి వయోభారం తోడవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. తన పనులు తాను చేసుకోలేని నిస్సహాయ స్థితికి చేరి రోజుల కొద్ది ఆహారం, ఔషధాలు లేక శుష్కించిపోయింది. ఆమె దయనీయ స్థితిని చూసి పొరుగు వారు చలించిపోయారు. వారంతా విషయాన్ని అప్పటి కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న దృష్టికి తీసుకువెళ్లారు. కార్పొరేటర్ చొరవ తీసుకొని వలసపాకలలో ఉన్న రెడ్ క్రాస్ వృద్ధాశ్రమంలో రాజేశ్వరిని చేర్చారు. అక్కడికి వెళ్లాక కూడు,గూడులోటు లేకున్నా కొడుకు కోసం పరితపిస్తున్న మనోవేదన మాత్రం ఆమె ఆరోగ్యాన్ని మరింత క్షీణింపజేసింది. తోటి వృద్ధులతో కొడుకు ఉండీ ఇలా అనాథలా బతుకుతున్నానని చెప్పుకొని కన్నీటిపర్యంతమయ్యేది. అలా అని ఎవరినీ తన కొడుకుని ఒక్క మాట కూడా అననిచ్చేది కాదు. 20 ఏళ్లుగా వదిలేశాడంటే వాడి పరిస్థితి పాపం ఎలా ఉందో అంటూ కొడుకు ఎన్నో కష్టాల్లో ఉన్నాడనే భ్రమలో ఆ మాతృమూర్తి బతుకీడ్చేది.

కాకినాడ జీజీహెచ్‌లో చేర్చి సేవలు చేశారు. నివాసాన్ని కోరుతూ కలెక్టర్ షణ్మోహన్‌కు లక్ష్మీప్రసన్న ఈ ఏడాది మే 12వ తేదీన లేఖ రాశారు. తక్షణమే స్పందించిన ఆయన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు, రాజేశ్వరి బాగోగులు పరిశీలించి తగిన నివాస సదుపాయం కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ రంగనాథం శైలజ రాజేశ్వరి బాగోగుల బాధ్యతలు చూసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, పెద్దాపురంలో బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘మన ఇల్లు’ వసతి గృహానికి రాజేశ్వరిని తరలించారు.

కొడుకా అని కలవరిస్తూ...

నాటి నుంచి రాజేశ్వరి తన కుమారుడి పేరును కలవరిస్తూనే ఉంది. వసతి గృహ వ్యవస్థాపకుడు సత్యనారాయణ, బృందం ఆమెకి సపర్యలు చేసేది. రాజేశ్వరి చివరి కోరికను తెలుసుకున్న సత్యనారాయణ విషయాన్ని శైలజ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె రాజేశ్వరి కుమారుడు రాజశేఖర్‌ను సంప్రదించి తల్లి దీనావస్థను వివరిస్తే రావడానికి తనకు తీరిక లేదని ఫోన్‌లో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. సత్యనారాయణ, ఆయన బృందం రాజశేఖర్‌తో మాట్లాడినా ఫలితం లేకపోయింది. తాను సంగీత దర్శకత్వం చేస్తుంటానని, చాలా బిజీగా ఉంటానని తనకు మాటి మాటికీ ఫోన్లు చేయవద్దని విసుక్కున్నాడు. అప్పటికే రాజేశ్వరి చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతోంది. తిండి మానేసింది, మందులు తీసుకోవడానికి శరీరం కూడా సహకరించడం లేదు. అటువంటి నిస్సత్తువలో కూడా కొడుకు కోసమే పరితపించేది. కొడుకా కొడుకా అంటూ కలవరించేది.



అంతిమ ఘడియల్లో కొడుకు పేరును కలవరిస్తున్న తల్లి రాజేశ్వరి

పోలీసుల వార్నింగ్

రాజశేఖర్ తన తల్లి స్థితిని కళ్లకు కట్టేలా వీడియోలు పంపి వివరించినా ఏ మాత్రం చలించలేదు. పైగా చెబుతున్న వారందరినీ తిట్టడం మొదలు పెట్టాడు. దీంతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. కాకినాడ టూ టౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు సూచనలతో పోలీసులు రాజశేఖర్‌కి కాల్స్ చేశారు. వచ్చి తల్లికి కనిపించి వెళ్లకపోతే సీనియర్ సిటిజన్ ప్రొటెక్షన్ యాక్ట్-2019 ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో మరో మార్గం లేక రాజశేఖర్ హైదరాబాద్ నుంచి బయల్దేరి ఈ నెల 10వ తేదీన ఉదయం వచ్చాడు. అయితే కొడుకు రాకకోసం పరితపించి అతడు రావడానికి కొద్ది గంటల ముందే ప్రాణాలు విడిచింది.

అత్యంత దయనీయం



రాజేశ్వరి పరిస్థితి అత్యంత దయనీయం. కుమారుడు రాజశేఖర్ వ్యవహరించిన విధానం మానవత్వానికి మాయని మచ్చగా మిగిలిపోయింది. టూ టౌన్ పోలీసులు, కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న చొరవ, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టితో చివరి రోజుల్లో కనీసం కూడు, గూడు అందాయి. పీడీ విజయకుమారి ఆధ్వర్యంలో వన్ స్టాప్ బృందం, బాధ్యత ఫౌండేషన్ సత్యనారాయణ బృందం రాజేశ్వరి చివరి క్షణాల వరకు కంటికి రెప్పలా కాచుకున్నాయి. పోలీసులు జోక్యం చేసుకుంటే కానీ కుమారుడు రాలేదు.

– రంగనాథం శైలజ, అడ్మినిస్ట్రేటర్, వన్ స్టాప్ సెంటర్

తల్లి తనకేం ఇవ్వలేకపోయిందనే...



తన తల్లి మెషీన్ కుడుతూ సంపాదించినది బంధువులకి పెట్టేస్తుందన్న భ్రమలో రాజశేఖర్ ఉండేవాడని నేను కార్పొరేటర్‌గా ఉన్న 36వ వార్డుకు చెందిన ప్రజల ద్వారా తెలిసింది. అంత డబ్బే ఆమె సంపాదిస్తే, అనాథలా కన్నుమూసేది కాదన్నది స్థానికుల అభిప్రాయం. కుమారుడిని చూడాలన్న ఆమె ఆఖరి కోరిక తీర్చేందుకు ఎంతో శ్రమించాం. ఎన్నోసార్లు కాల్ చేసి ఒక్కసారి వచ్చిపొమ్మని బతిమాలాం. ఆమె మరణించినా తర్వాత కార్యక్రమాలన్నీ మేమే చూసుకుంటామని చెప్పాం అయినా వినలేదు.

– సాలగ్రామ లక్ష్మీప్రసన్న, మాజీ కార్పొరేటర్, 36వ వార్డు, కాకినాడ

సుదర్శన హోమానికి సంప్రదాయ దుస్తులు తప్పనిసరి

- పురుషులు పంచె, కండువా..
- మహిళలు చీర, జాకెట్టు లేదా పంజాబీ డ్రెస్ చున్నీతో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో నిత్యం నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలో పాల్గొనే భక్తులు ఇకపై సంప్రదాయ దుస్తులను తప్పనిసరిగా ధరించాలని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎస్‌వీ ప్రసాద్ సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దేవస్థానం కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు. పురుషులు పంచె, కండువా, మహిళలు చీర, జాకెట్టు లేదా పంజాబీ డ్రెస్, చున్నీతో పాల్గొనాలన్నారు.

సంప్రదాయ దుస్తులు ధరించడంలో పరమార్థం

దైవ దర్శనం సమయంలో సంప్రదాయ దుస్తులు ధరించడంలో పరమార్థం గురించి ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు వివరించారు. దేవాలయానికి వెళ్లిన దగ్గర నుంచి దర్శనం చేసుకుని బయటకు వచ్చే వరకూ మన దృష్టి దేవుని



అంతర్వేదిలో సుదర్శన హోమానికి ధరించాల్సిన సంప్రదాయ దుస్తులపై రూపకల్పన చేసిన చిత్రం

మీదనే ఉండాలి. అందుకే మన పెద్దలు భక్తులు ధరించే వస్త్రాలు సంప్రదాయ బద్ధంగా ఉండాలనే ఆచారాన్ని పెట్టారని వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి: మండలంలోని ఎల్లయ్యపేటలో ఓ ప్రైవేటు హేచరీలో వంట గ్యాస్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడని ఎస్సై జగన్మోహన్‌రావు సోమవారం తెలిపారు. ఈ నెల 18న హేచరీలో సిబ్బందికి వంట చేస్తుండగా గ్యాస్ పొయ్యి నుంచి మంటలు రావడంతో సూరాడ అనంతలక్ష్మి, కుందేటి వీరబాబు, వ్రజపునాని గాయపడ్డారు. కాకినాడ ఆస్పత్రికి తరలించారు. పంపాదిపేటకు చెందిన కుందేటి వీరబాబు(23) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ప్రసాద్
- తూర్పు గోదావరి జిల్లాలోని మహిళా సర్పంచ్‌లకు శిక్షణ ప్రారంభం

సామర్లకోట: మహిళా ప్రజా ప్రతినిధులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని మహిళా సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణను సోమవారం ఆయన ఈటీసీలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సర్పంచ్‌లు స్వతంత్రంగా పని చేయాలని సూచించారు. రాజకీయంగా ఎదగడానికి సర్పంచ్ పదవి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను దగ్గర ఉండి తెలుసుకొనే అవకాశం సర్పంచ్‌లకే ఉంటుందన్నారు. మహిళలు అన్ని రంగాలలోను పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని, అయితే సర్పంచ్‌లు వెనుబడుతున్నారన్నారు. మహిళా సర్పంచ్‌లు స్వయం నిర్ణయాధికారంతో పాలన సాగించాలన్నారు. ఉత్తమ సేవలు అందిస్తే గ్రామంలోని ప్రతీ మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందడానికి వీలు కలుగుతుందన్నారు. కోర్సు డైరెక్టరు కె. సుశీల శిక్షణ కేంద్రం ఆవరణలో మహిళా సర్పంచ్‌లను గ్రూపులుగా ఏర్పాటు చేసి వివిధ అంశాలపై చర్చలు జరిపే ఏర్పాట్లు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, ఎం చక్రపాణిరావు, ఎ.రవిశంకర్ శిక్షణ నిర్వహించారు.



మహిళా సర్పంచ్‌ల శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

వేటగాళ్ల అరెస్టు

తుపాకీ స్వాధీనం

గండేపల్లి: వన్య ప్రాణులను వేటాడే వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కె గోపాలపురం శివారులో వన్య ప్రాణులను వేటాడేందుకు వచ్చిన వ్యక్తులను ఎస్ఐ శివ నాగబాబు, సిబ్బందితో కలిసి గండేపల్లికి చెందిన జి నాగార్జున, ఎం రాంబాబు, జి సత్తిబాబును అరెస్ట్ చేయగా రాజమహేంద్రవరానికి చెందిన మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు తెలిపారు. వీరి వద్ద నుంచి సింగిల్ బ్యారల్ నాటు తుపాకీ, 12 మీడియం ఐరన్ బాల్స్, 65 స్మాల్ ఐరన్ బాల్స్, 3 సెల్ ఫోన్స్, 2 మోటార్ సైకిళ్లు, 2 ఎడ్ టార్చ్ లైట్లు, తుపాకీ ఫైర్ చేయడానికి ఉపయోగించే రెండు రకాల పౌడర్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు తెలియజేశారు.



ముద్దాయిలను అరెస్టు చేసిన ఎస్సై, సిబ్బంది

ఎంటీఎస్ టీచర్ల బదిలీలు పూర్తి

రాయవరం/ బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 2008, 1998 డీఎస్సీ మినిమమ్ టైమ్ స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. ఆదివారం రాత్రి 8.30 గంటలకు ప్రారంభమైన ప్రారంభమైన కౌన్సెలింగ్ సోమవారం వేకువజాము వరకు కొనసాగింది. కాకినాడ సర్వశిక్షాభియాన్ సమావేశపు హాలులో ఆఫ్‌లైన్ విధానంలో డీఈవో పి.రమేష్ ఆధ్వర్యంలో బదిలీల ప్రక్రియ చేపట్టారు. 2008 డీఎస్సీకి చెందిన 197 మంది, 1997 డీఎస్సీకి చెందిన 209 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు బదిలీ కౌన్సిలింగ్ ద్వారా వారికి కావాల్సిన పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. బదిలీల్లో కోరుకున్న స్థానాలు పొందిన ఉపాధ్యాయులు సోమవారం పూర్వపు స్థానాల్లో రిలీవ్ అయ్యి, కోరుకున్న స్థానాల్లో విధుల్లో చేరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కరప: పెనుగుదురు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరప మండలం పెనుగుదురు వంతెన వైపు నుంచి కాకినాడ వైపు గుర్తుతెలియని వ్యక్తి సైకిల్‌పై వెళుతుండగా పెనుగుదురు బస్‌స్టాప్ వద్ద టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి ముఖం గుర్తుపట్టలేని విధంగా తలకు తీవ్రగాయాలయ్యాయి.

కరప ఎస్ఐ టి.సునీత సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాద వివరాలను అక్కడివారిని అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఉంచుతామని, ఆచూకీ తెలిసినవారు కరప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, లేదా తన మొబైల్ నంబరు 9440796557 కు ఫోన్‌చేయాలని ఎస్ఐ కోరారు. ఎస్ఐ సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి ఇంటికి వచ్చి కుప్పకూలి పీఈటీ మృతి

కాకినాడ రూరల్: పిఠాపురం సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న ఎంద్రెడ్డి సూర్య ఉమా వాణిశ్రీ(53) కాకినాడ సిద్ధార్థనగర్‌లోని తల్లి ఇంటికి సోమవారం వచ్చి కుప్ప కూలి మృతి చెందారు. సర్పవరం పోలీసుల వివరాలు ప్రకారం కొద్దిసేపు మాట్లాడి సడన్‌గా పడిపోవడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. వైద్యులు ఆమె మృతి చెందినట్టు నిర్ధారించడంతో కుమార్తె ప్రవల్లిక ఫిర్యాదు మేరకు ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. గుండెపోటు కారణంగా మృతి చెంది ఉంటారని భావిస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

పిఠాపురం ఉద్యోగాల్లో

పిఠాపురం: ఎంతైనా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గం కదా దానికి ఒక ప్రత్యేకత ఉండాలనుకున్నారో ఏమో చిరుద్యోగులను గాల్లో తిప్పుతున్నారు ఉన్నతోద్యోగులు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఉద్యోగులు గాల్లో చక్కర్లు కొడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన వారిని ఇక్కడి అధికారులు జాయిన్ చేసుకోకపోవడంతో 13 రోజులుగా గాల్లో ఉండిపోవాల్సి వచ్చిందంటూ ఉద్యోగులు వాపోతున్నారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లే వారిని రిలీవ్ చేయకపోవడంతో బదిలీలు అయిన వారు ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి. ఇప్పటికే తాము పనిచేస్తున్న చోట రిలీవ్ అయిన ఉద్యోగులను ప్రస్తుతం ఇక్కడ జాయిన్ చేసుకోపోవడంతో గాలిలో ఉన్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఆర్డీ నుంచి బదిలీ ఉత్తర్వులతో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీలకు ఏడుగురు జూనియన్ అసిస్టెంట్లు తుని, సామర్లకోట మున్సిపాలిటీల నుంచి బదిలీపై వచ్చిన సిబ్బంది ఉత్తర్వులతో మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు తప్ప జాయినింగ్‌కు మాత్రం అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో రెండింటికీ చెడ్డ రేవడిగా తయారయ్యింది చిరుద్యోగుల పరిస్థితి.

300 లీటర్ల స్పిరిట్, మద్యం బాటిల్స్ స్వాధీనం

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని ఆకులవారి వీధిలో యానాం, కామనగరువుకు చెందిన ఇద్దరు యువకులు నకిలీ మద్యం తయారు చేసి బెల్ట్ షాపులకు విక్రయిస్తున్న ఓ ఇంటిపై ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక ఆధ్వర్యంలో సోమవారం మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 టిన్నుల్లో సుమారు 300 లీటర్ల స్పిరిట్, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సూపర్‌టెండెంట్ వరప్రసాదు తెలిపారు. పాండిచ్చేరి యానాం నుంచి వచ్చిన సమాచారం మేరకు మెరుపు దాడి చేశామన్నారు. నకిలీ మద్యం తయారీపై మంగళవారం పూర్తి విషయాలు వెల్లడిస్తామని ఎక్సైజ్ ఎస్పీ తెలిపారు. ఈ దాడిలో అసిస్టెంట్ కమిషనర్ రేణుక, ఎస్పీ వర ప్రసాదుతో పాటుగా సీఐ వీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రదర్శన

భువనేశ్వర్: సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ-మేనేజ్‌మెంట్ (సీయూటీఎం) అరుదైన ఘనత సాధించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రారంభమైన 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ (డీఏసీ)లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా తన సామర్థ్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఈ కాన్ఫరెన్స్ ఈ నెల 22న ప్రారంభమైంది, 25 వరకు కొనసాగనుంది. సెమీకండక్టర్, డిజైన్ ఆటోమేషన్ పరిశ్రమ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సెంచూరియన్ ప్రాతినిధ్యం వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ‘చిప్స్ టు సిస్టమ్స్’ అనే శీర్షికతో నిర్వహిస్తున్న డీఏసీ కార్యక్రమానికి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ), సెమీకండక్టర్ టెక్నాలజీలు, సిస్టమ్ ఇన్నోవేషన్ రంగంలో దిగ్గజాలు హాజరయ్యాయి. వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్‌దాస్, లక్ష్మీకాంత్ సుతార్‌లతో కూడిన బృందం సెంచూరియన్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీఎన్ రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై సామర్థ్యాన్ని ప్రదర్శించిన తొలి వర్సిటీగా సెంచూరియన్ నిలుస్తుందన్నారు. వర్సిటీలో సెమీకండక్టర్ టెక్నాలజీ పాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మార్క్యూ సెమీ కండక్టర్స్‌తో ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రపంచ స్థాయిలో సెంచూరియన్ తన ఉనికి చాటుకుంటుందని ఆశాభవం వ్యక్తం చేశారు.



శాన్ ఫ్రాన్సిస్కో డీఏసీకి ప్రాతినిధ్యం వహించిన సీయూటీఎం ప్రతినిధులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260